RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## ఏపీలో భారీగా కలెక్టర్లు బదిలీలు

గుంటూరు కలెక్టర్ గా నాగలక్ష్మివిశాఖపట్నం కలెక్టర్ మల్లికార్జున్ బదిలీ, జిఏడికిరిపోర్ట్‌చెయ్యాలని ఆదేశంఅల్లూరి జిల్లా కలెక్టర్ గా దినేష్ కుమార్‌కాకినాడ జిల్లా కలెక్టర్‌గాసాగిశన్మోహన్‌జే నివాస్ జి ఏ డి కి రిపోర్ట్ చెయ్యాలని ఆదేశంఏలూరు జిల్లా కలెక్టర్ గా వెత్రి సెల్వితూర్పుగో దావరి జిల్లా కలెక్టర్‌గాపిప్రశాంతివిజయనగరం జిల్లాకలెక్టర్ గా బి ఆర్ అంబేద్కర్ పశ్చిమగోదావరిజిల్లా కలెక్టర్‌గా నాగ రాణిఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గా సృజన ప్రకాశం జిల్లాకలెక్టర్‌గా తమీమ్ అన్సారీ యాకర్నూల్ జిల్లా కలెక్టర్‌గారంజిత్ బాషాబాపట్ల జిల్లా కలెక్టర్ గా జేసీ కి ఇంచార్జ్ బాధ్యతలు...!!

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**

కర్నూలు సంపుటి : 04 సంచిక : 53 | మంగళవారం 25-06-2024 | పేజీలు :04 వెల:రూ.2.00

## ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి ప్రమాణం..



తొలి సమావేశాలు మరికాసేపట్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. మరోవైపు ప్రొటెం స్పీకర్ అంశంపై అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమి మధ్య వివాదం కొనసాగుతోంది. లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఏడు సార్లు ఎంపీగా ఎన్నికైన భర్తృహరి మహతాబ్‌ను నియమించినట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల చేసిన ప్రకటనపై ఇండియా కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భర్తృహరి కంటే కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ సీనియర్ అని, దళితుడైనందు వల్లే సురేశ్‌కు ప్రొటెం స్పీకర్ పదవి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. విపక్షాల ఆరోపణలపై కిరణ్ రిజిజు స్పందిస్తూ ప్రొటెం స్పీకర్‌గా మహతాబ్ ఎంపికను సమర్థించుకున్నారు. మహతాబ్ వరుసగా ఏడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారని, సురేష్ అలా కాలేదని చెప్పారు. సురేశ్ 2004 ముందు నాలుగుసార్లు, ఆ తర్వాత వరుసగా నాలుగుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రొటెం స్పీకర్ అంశం లోక్‌సభ సమావేశాల్లో హాట్ టాపిక్‌గా మారే అవకాశం కనిపిస్తున్నది.కాగా, ఈ సమావేశాల్లో లోక్‌సభ ఎన్నికల్లో కొత్తగా ఎంపీలుగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. 24, 25 తేదీల్లో వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఆ తర్వాత 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. అనంతరం 27న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై చర్చ జూన్ 28న ప్రారంభం అవుతుందని, ప్రధాని మోదీ జూలై 2 లేదా 3న చర్చకు సమాధానం ఇచ్చే అవకాశం ఉన్నదని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాల తర్వాత స్వల్ప విరామం అనంతరం జూలై 22న పూర్తి స్థాయి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఉభయ సభలు తిరిగి సమావేశం కానున్నాయని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.

## లోక్‌సభ సమావేశాలు ప్రారంభం

**కార్యాక్రమాలు ప్రారంభించిన ప్రోటెమ్ స్పీకర్ భర్తహరి**
**కొత్త పార్లమెంట్ భవనంలో సభ్యుల ప్రమాణం**
**తొలుత ప్రమాణం చేసిన ప్రధాని మోదీ**
**తదుపరి మంత్రులు రాజ్‌నాథ్,అమిత్ షా, గడ్కరీ, శివరాజ్ ప్రమాణాలు**
**రాహుల్ వయనాడ్‌కు రాజీనామాను స్పీకర్ ఆమోదించినట్లు ప్రకటన**




న్యూఢిల్లీ,జూన్ 24: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. కార్యక్రమాలను ప్రారంభించారు. సభ్యులు రాజ్యాంగం మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికలన సభ్యుల జాబితాను లోక్‌సభ సెక్రటరీ సభ ముందుంచారు. అలాగే రాహుల్ గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు భర్తృహరితో రాష్ట్రపతిభవన్‌లో ప్రోటెం స్పీకర్‌గా రాష్ట్రపతి ముర్ము ప్రమాణం చేయించారు. లోక్‌సభాపక్ష నేతగా ప్రధాని మోదీ తొలుత ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే ఎన్డీయే కూటమి సభ్యులంతా మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నామినేటెడ్ ప్యానల్ స్పీకర్లు ప్రమాణం చేశారు. అయితే విపక్ష ఎంపిలు కొందరు ఇందుకు ముందుకు రాలేదు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయించారు. మంత్రుల్లో తొలుత రాజ్‌నాథ్ సింగ్ తరవాత అమిత్ షా, గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు వరుసగా ప్రమాణం చేశారు. తొలిరోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారితో మంగళవారం ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 26న స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27న రాజ్యసభ కూడా ప్రారంభం కానుంది. అదే రోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించ నున్నారు. విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంటు సముదాయంలోని పాత భవనం వద్ద కలుసుకుని, అక్కడి నుంచి నూతన భవనం వరకు ర్యాలీగా వచ్చారు. మొన్నటివరకు మహాత్మాగాంధీ విగ్రహం ఉన్న ప్రాంతంలో రాజ్యాంగం చిరు ప్రతులను చేతపట్టుకుని కొంతసేపు నిరసన చేపట్టారు. అనంతరం వీరంతా ఒకేసారి లోక్‌సభకు వెళ్లారు. సభ ప్రారంభం కాగానే కేరళలోని వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన రాజీనామాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ రాహుల్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనంతరం వయనాడ్‌ను వదులకుని రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని ఆయన నిర్ణయించుకున్నారు.

# హెల్త్ వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్దరణ

**మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ**
**డిసెంబర్ 10లోపు పోస్టులను భర్తీ చేసేలా ప్రణాళిక**
**ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు..కొత్తగా టైటిల్ డీడ్లు**
**జులై నుంచి పెంచిన పెన్షన్ అమలు**
**గంజాయి నిర్మూలనకు హోంమత్రితో కమిటీ**
**ఎపి కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు**
**వివరాలు వెల్లడించిన మంత్రి పార్ధసారథి**





అమరావతి,జూన్24 దాదాపు మూడున్నర గంటల పాటు కొనసాగిన ఎపి కేబినేట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హెల్త్ వర్సిటీకి తిరిగి ఎన్టీర్ పేరును పునరుద్దరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే సిఎంగా చంద్రబాబు సంతకం పెట్టిన పలు అంశాలకు కూడా కేబినేట్ ఆమోదించింది. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సీఎం చేసిన ఐదు సంతకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించాలని నిర్ణయించింది. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఏప్రిల్ నుంచి పింఛను రూ.4వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్తగా టెట్ నిర్వహణ, టెట్ లేకుండా డీఎస్సీ నిర్వహణ ప్రతిపాదనలపై చర్చించారు. డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు క్యాబినెట్ ముందుంచారు. జులై ఒకటి నుంచి పక్రియను ప్రారంభించి డిసెంబర్ 10లోపు 16,347 పోస్టులను భర్తీ చేసేలా ప్రణాళికను రూపొందించారు. పింఛన్ల పెంపు అంశంపైనా మంత్రివర్గంలో కీలకంగా చర్చించారు. దీని కింద ఇచ్చే మొత్తం రూ.3వేల నుంచి రూ.4లకు పెంచే నిర్ణయానికి ఆమోదం తెలిపారు. జులై 1 నుంచి పెంచిన పింఛన్లను ఇంటి వద్దే అందజేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత మూడునెలలకు కలిపి వచ్చే నెలలో ఒక్కొక్కరికి రూ.7వేల పింఛను అందనుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది లబ్దిదారులకు ఈ మొత్తాలను పంపిణీ చేయనున్నారు. గంజాయి నివారణకు హోంమంత్రి అనిత సారథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హోం, రెవెన్యూ, హెల్త్, గిరిజన శాఖ మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేయనున్నారు. గంజాయి నియంత్రణపై మంత్రుల కమిటీలో సభ్యుడిగా మంత్రి నారా లోకేశ్ ఉండనున్నారు. 6 శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం, మద్యం, ఆర్థిక అంశాలతో పాటు శాంతిభద్రతల అంశంపైనా శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీ అనంతరం రాజకీయ అంశాలపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసారు. ఇకపోతే కేబినేట్ భేటీ వివరాలను మంత్రి పార్ధసారథి వివరించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను దగా చేసిందని మంత్రి పార్ధసారథి ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ పేరిట అన్ని స్కూళ్లలో 16,347 టీచర్ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదించిందని వెల్లడించారు. క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు తీరని నష్టం చేసింది. టెట్ పరీక్షను ప్రతి ఆర్నెళ్లకోసారి నిర్వహించాల్సి ఉండగా.. అలా చేయకపోవడం వల్ల వేలాది మంది నిరుద్యోగులు నష్టపోయారు. టెట్‌లో తమ మార్కులు ఇంప్రూవ్ చేసుకొనే అవకాశం కోల్పోయారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని సీఎం ఆదేశించారని వివరించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం చూస్తే చాలు.. గత ప్రభుత్వ పాలన ఏంటో తెలుస్తుంది. కేంద్రం చెప్పిన దానికి రాష్ట్రం అమలు చేసిన దానికీ అసలు పొంతన లేదు. భాజపా పాలిత రాష్ట్రం ఏ ఒక్కటీ ఈ చట్టాన్ని అమలు చేయలేదు. ఈ చట్టం వల్ల సన్న, చిన్నకారు రైతులు సమస్యలు ఎదుర్కొన్నారు. వివాదాలు వస్తే అప్పిలేట్ అథారిటీ ఎవరో చెప్పలేదు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంలో నేరుగా హైకోర్టుకే జ్యూరిస్‌డిక్షన్ ఇచ్చారు. పేద రైతు ఎవరైనా ఖర్చులు భరించి హైకోర్టుకు వెళ్లగలరా? ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. రైతులందరికీ ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇస్తాం అని అన్నారు. పింఛను పెంచిన మొత్తాన్ని రూ.4 వేలు జులై 1 నుంచి ఇస్తాం. పింఛను పెంపు వల్ల 65 లక్షల మందికి లబ్ది జరుగుతోంది. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేస్తాం. కొన్ని రకాల వ్యాధి బాధితులకు రూ.10వేలు పింఛను ఇస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్‌కు మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. వ్యవసాయ రంగంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ అమలు చేస్తాం. గంజాయి నియంత్రణకు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయగా.. ఈ కమిటీలో సభ్యులుగా హోం, విద్య, ఎక్సైజ్, గిరిజనశాఖ మంత్రులు ఉంటారు. గంజాయి సమస్యను అరికట్టేందుకు కట్టుబడి ఉన్నాం. రాష్ట్రంలో గంజాయి అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకున్నాం. కమిటీ ఇచ్చిన సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. పేదవాడికి నాణ్యమైన భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభిస్తున్నాం. మొదట 183 అన్న క్యాంటీన్లు ఒకేసారి ప్రారంభిస్తాం.. త్వరలో మరో 20 అన్న క్యాంటీన్లను తెరుస్తాం. వైఎస్ఆర్ ఆరోగ్య వర్సిటీ పేరును ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీగా మార్చాం. వర్సిటీ పేరు మార్పు వల్ల వైద్యులు అనేక ఇబ్బందులు పడ్డారు. దీంతో వైద్యులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు ఆ పేరును మార్పు చేశాం. రాష్ట్రంలో నైపుణ్య గణన కార్యక్రమానికి, రాష్ట్ర ఏజీగా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను నియమిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతాం

**గత పదేళ్ల అనుభవం..సభ్యుల సహకారంతో ప్రజలకు సేవ**
**140కోట్ల ప్రజల ఆకాంక్షలు గుర్తెరిగి పనిచేస్తా**
**రాజ్యాంగానికి అనుగుణంగా పాలన సాగిస్తా**
**విపక్షాలు కూడా ప్రజల పక్షాన బలంగా నిలబడాలి**
**పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రధాని మోడీ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ,జూన్ 24 : వికసిత్ భారత్ సంకల్పం, కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. తమ పదేళ్ల పాలనానుభవం, కొత్త సభ్యుల ఆకాంక్షలు, దేశ ప్రజల ఆశల మేరకు ముందుకు సాగుతామని అన్నారు. మరింత కఠన శ్రమతో దేశానికి సేవచేస్తానని మోడీ ప్రకటించారు. కొత్త పార్లమెంటు భవనంలో లోక్‌సభ సమావేశాలు సోమవారం ప్రారంభం అయిన సందర్భం గా మోడీ మీడియాతో మాట్లాడారు. లోక్ సభ సభ్యులకు ప్రధాని మోడీ స్వాగతం పలికారు. ఇది చాలా పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరస్తామని, సామాన్య ప్రజల కలలు సాకారం చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మూడోసారి సేవచేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారని, సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని మోడీ వివరించారు. ప్రజలు మా విధానాలను విశ్వసించారని, సరికొత్త విశ్వాసంతో కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నామని, రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నామని, రేపటితో అత్యయిక పరిస్థితి 50 ఏళ్లు పూర్తివుతుందని, అత్యయిక పరిస్థితి ఒక మచ్చ అని, 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదని మోడీ తెలిపారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సభ్యులంతా ఇప్పటికే పార్లమెంట్ భవనానికి చేరుకున్నారు. ఇక వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న నరేంద్ర మోదీ కూడా పార్లమెంట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. దేశానికి మూడోసారి సేవచేసే భాగ్యాన్ని కల్పించినందుకు ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. 'ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల పక్రియ నిర్వహించాం. 65 కోట్ల మంది ఓటర్లు ఈ పక్రియలో పాల్గొన్నారు. మా విధానాలకు, అంకితభావానికి జనామోదం లభించింది. ప్రజలు మాకు వరుసగా మూడోసారి సేవచేసే అవకాశం కల్పించారు. ఇది చాలా పవిత్రమైన రోజు. కొత్త సభ్యులకు స్వాగతం. కొత్త ఆశలు, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలి. అందరి సహకారంతో భరతమాత సేవలో పాల్గొంటాం. కొత్త లక్ష్యాలను చేరుకోవడానికి మనమంతా కృషి చేయాలి. 2047 వికసిత్ భారత్ సంకల్పం, లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. రాజ్యాంగానికి గౌరవం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాం. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతాం. భారత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కృషి చేస్తాం' అని మోదీ తెలిపారు. ఎమర్జెన్సీ ద్వారా ప్రజాస్వామ్యంపై పడిన మచ్చకు 50 ఏళ్లు అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పట్లో ప్రజలను జైళ్లలో వేసినట్లు చెప్పారు. 50 ఏళ్లకిందట జరిగిన తప్పు మరెవరూ చేయకూడదన్నారు. మూడో దఫాలో మూడు రెట్లు అధికంగా పనిచేస్తామని ఈ సందర్భంగా మోదీ పునరుద్ఘాటించారు. జనహితం కోసం సభ్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. 18వ లోక్‌సభలో విపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. ఉదయం పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. స్వాతం త్య్రం వచ్చిన తర్వాత తొలిసారిగా లోక్‌సభ ఎంపీల ప్రమాణస్వీకారం మన కొత్త పార్లమెంట్ భవనంలో జరగనుంది. ఈ శుభ సమయాన కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతాభినందనలు తెలియజేస్తున్నా. ప్రజలు మా విధానాలను విశ్వసిం చారు. దేశానికి మూడోసారి సేవ చేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారు. సరి కొత్త విశ్వాసంతో నేడు కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నాం. రాజ్యాం గానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటాం. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నాం. ఈ సంద ర్భంగా విపక్ష ఎంపీలకు చురకలం టించారు. ఈ దేశానికి మంచి, బాధ్య తాయుతమైన విపక్షం అవసరం. ప్రజాస్వామ్య మర్యాదను కాపాడేలా, సామాన్య పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు నడుచుకుం టాయని ఆశిస్తున్నా. డ్రామాలు, ఆటంకాలను ప్రజలు కోరుకోవట్లేదు. నినాదాలు ఆశించట్లేదు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు విపక్షాలు కూడా సహకరించాలని ప్రధాని హితవు పలికారు.

# సంపాదకీయం

మంగళవారం 25-06-2024

## అప్పులకు పరిష్కారం ఎలా ?

ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా రాజధాని అన్నది ఓ తలకాయ లాంటిది. అది లేకుంటే తలలేదనే చెప్పాలి. అందుకే జగన్ తలకాయ లేని పనులన్నీ చేశారు. అప్పులను చేసి హాయిగా ఉన్నారు. 14 లక్షల కోట్ల అప్పు ఇప్పుడు ఎపి నెత్తిన పడింది. అంటే ఇది సామాన్యమైన అప్పుకాదు. తెలంగాణలోనూ ఇలాంటి పనే చేసి కెసిర్ 7లక్షల కోట్ల అప్పులు పెట్టారు. ఈ ఇద్దరు చేసిన నిర్వాకం కారణంగా ఇరు తెలుగు రాష్ట్రాలు 21 లక్షల కోట్ల అప్పులను మోయాల్సి వస్తోంది. ఇలా అప్పులు చేసి వదిలి వెళ్లిన వారిని వదిలేయడం సమంజసమా అన్నది ప్రజలు ఆలోచించాలి. కేంద్రం ఆలోచించాలి. పార్టీలు ఆలోచించాలి. ఇలా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసిన వారిని ఏం చేయాలన్నది చర్చించాలి. అప్పులో ఆస్తులు కూడా బెట్టామని బొంకిన మాజీ సిఎంలను ప్రజాక్షేత్రంలో నిలబెట్టాలి. ఎవరు అప్పులు చేసినా వారిని బోను ఎక్కించా ల్సిందే. దక్షత లేకుండా చేసిన పాలన కారణంగా ప్రజలు నష్టపోయారు. వీరు బాగుపడ్డారు. ఇకపోతే ఎపిలో అయితే మరీ దారుణంగా అప్పులు చేశారు. రాజధాని అన్నది కూడా లేకుండా చేశారు. జగన్ పాలనా పగ్గాలు చేపట్టిన ఐదేళ్లలో అప్పులు తప్ప ఒక్క మంచి పనీ చేయాలేదు. మళ్లీ తాను అధికారంలోకి వస్తానన్న ధీమాలో రుషికొండపై అద్దాల మేడలు కట్టుకున్నారు. మరోమారు తాను సిఎం అన్న ధీమాలో ఆయన పాలన సాగించారు. రాజధాని లేకుండా...మూడు రాజధానులు అంటూ ఊరించి ఐదేళ్లకాలం గడిపారు. ఈ ఐదేళ్లలో అటు అమరావతి కానీ..ఇటు వైజాగ్ కానీ రాజధానిగా చేయలేకపోయారు. కానీ మోయలేనంతగా అప్పులు మాత్రం చేశారు. రాజధానితో ఆపటు పోలవరం ప్రాజెక్టును, అభివృద్ధి కార్యక్రమాలను కోల్డ్ స్టోరేజికి ఎక్కించారు. తాను అధికారంలో ఉన్నంత కాలం అమరావతిపై స్పష్టత లేకుండా పాలన సాగించారు. ఇలా రాజధాని లేకుండా పాలన చేయొచ్చని నిరూపిచారు. తన పట్టుదలలో ఇసుమంతయినా సడలింపు లేకుండా సాగారు. దీనిని ప్రజలు ఎలా స్వీకరిస్తారన్నది ఎన్నికల్లో తేల్చి చెప్పారు. 151 సీట్లలో మధ్యలో 5ను లాగేసి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఆయన ఆత్మపరిశీలన చేసుకోకుండా ఇవిఎంలను తప్పుపడుతున్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్న చందాన కెసిఆర్, జగన్‌ల తీరు ఉంది. రాష్ట్ర విభజన నాటి నుండి రాజధానిని ఎక్కడ నిర్మించాలనే సమస్య మొదలైంది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా అవకాశం ఉన్నా ..చంద్రబాబు ఇక్కడినుంచి వదిలి వెళ్లారు. దీంతో అమరావతి కోసం నానా కష్టాలు పడ్డారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా చేపట్టిన అమరావతిలో అసలు నిర్మాణాలు జరగలేదని, డబ్బు వృధా చేశారన్న వాదనలు ముమ్మరం చేశారు. నవ్యాంధ్ర మొదటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికైన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతుల నుండి వేల ఎకరాలు సమీకరించారు. పలు నిర్మాణాలు చేపట్టినా, పూర్తి చేయడంలో నిధుల కొరత కారణంగా అసెంబ్లీ, సచివాలయం తదితర నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో నిర్మాన పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈలోపు జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పదవి చేపట్టిన నాటి నుండి రాజధానిని తరలిస్తారనే వాదన బలంగా వినిపించారు. అనుకున్నట్లే ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, ప్రాజెక్టులలో అవకతవకలు జరిగాయని ప్రాథమిక నివేదిక అందించింది. దీంతో రాజధాని తరలింపు తప్పదని స్పష్టం చేశారు. దీనికితోడు ఇక్కడ సేకరించిన భూముల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి సమస్యను మరింత జఠిలం చేయాలని చూశారు. అప్పటికే రాజధాని నిర్మాణాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కేంద్ర సహకారం అంతంత మాత్రమే. అసలే నిధుల లేమితో కొట్టు మిట్టాడుతున్న రాష్ట్రం మళ్లీ రాజధానిని తరలిస్తే ఎంత నష్టపోతుందో ముఖ్యమంత్రి జగన్ గ్రహించ లేదు. అందుకే మూడు రాజధానాలు పేరుతో ఐదేళ్ల కాలం గడిపేశారు. రాజకీయ లబ్ది కోసం తడవకోసారి రాజధాని మార్చుకుంటూ పోతే రాష్ట్రం అథోగతి పాలవుతుందన్న విమర్శలు వచ్చినా ఆనాటి సిఎం జగన్ గుర్తించ లేదు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు రాజధాని, పోలవరం నిర్మాణాల కోసం బాగానే కష్టపడ్డారు.న ఞాష్ట్ర సమగ్ర అభివృద్ధికి జలవనరులు దోహద పడతాయి. గోదావరి నదీ జలాలతో రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయవచ్చు. విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం గట్టిగానే పనిచేసింది. అయితే రూ.33 వేల కోట్లతో చేయవలసిన పునరావాస పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. జగన్ ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు వివరించి, పునరావాసం తో సహా ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉన్నా ఐదేళ్లలో కూడా పూర్తి చేయించలేదు. నదీజలాలు ఉన్నా వాడుకునే వ్యూహాలు కానరాలేదు. తాజాగా ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు కనుక గోదావరి నదీ జలాలను కృష్ణానదికి తరలింపుపై నిపుణులతో, అఖిల పక్షాలతో చర్చించిన తరువాత నిర్ణయాలు చేయాలి. ఉత్తరాంధ్రాలో వంశధార, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. ప్రకాశం జిల్లాకు ప్రాణప్రదమైన వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. 1956లో ఏర్పడిన ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధిని హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతం చేశారు. ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, ఐ.టి పరిశ్రమలు, కేంద్ర కార్యాలయాలన్నీ హైదరాబాదు లోనే అభివృద్ధి చేశారు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజధాని పేరుతో కేంద్రీకరణకు పూనుకున్నది. రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూసమీకరణ, నవ నగరాల నిర్మాణ ఆలోచనలు, సింగ్‌పూర్ కంపెనీలతో స్టార్టప్ ఒప్పందం, స్విస్ ఛాలెంజ్ పద్ధతి, ప్రైవేటు సంస్థలకు భూముల కేటాయింపు మొదలైన చర్యలన్నీ చకచకా చేశారు. ఈ క్రమంలో ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాయలసీమలో కడప, కర్నూలు, వంటి ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. విభజన చట్టంలో చెప్పిన విధంగా కడప ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం/రామాయ పట్నం ఓడరేవు ప్రభుత్వ రంగంలో నిర్మాణం జరగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. నీటి వనరుల ఆధారంగా వ్యవసాయం, వెనుకబాటు తనం ఆధారంగా పరిశ్రమలు స్థాపించినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుంది.

# ఆర్థిక సవాళ్లను అధిగమించాలంటే కేంద్రం సహకరించాలి

**పోలవరం, అమరావతి నిర్మాణాలకు తోడ్పాటు ఇవ్వాలి**
**పారిశ్రామిక రాయితీలు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు తోడ్పడాలి**
**ఆక్వా పార్కులు,టెక్స్ టైల్ పార్కులు, గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు మద్దతు**
**ప్రీ బడ్జెట్ సమావేశంలో సమస్యలను ఏకరువు పెట్టిన ఎపి ఆర్థికమంత్రి పయ్యావుల**



న్యూఢిల్లీ,జూన్24 : విభజన వల్ల వచ్చిన ఆర్థిక సవాళ్లను అధిగమించడానికి, గడిచిన 5 ఏళ్లలో ఆర్థిక పరమైన తప్పులను సరిదిద్దాడానికి కేంద్ర సహకారం కావాలని కోరానని ఏపీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్రానికి ఏం కావాలి అనే దానిపై కేంద్రానికి నివేదిక అందజేశానని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి కావడానికి సహకారం అందించాలని కోరామన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ నేతృత్వంలో జరిగిన ప్రీ బ్జడెట్, జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో పయ్యావుల పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి సహకారం,వెనుకబడిన జిల్లాల అభివృద్ధి సహకారం ఇవ్వాలని కోరామన్నారు.పారిశ్రామిక రాయితీలు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు సహకారం ఇవ్వాలని, ఆక్వా పార్కులు,టెక్స్ టైల్ పార్కులు, గ్రీన్ ఎనర్జీ కారిడార్ కు మద్దతు కావాలని కోరామన్నారు. తిరుపతి వైజాగ్ ఎయిర్ పోర్ట్‌లకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరామన్నారు. రైల్వే జోన్ ఆపరేషన్‌కు సహకారం ఇవ్వాలన్నారు. రైల్వే జోన్ ఆపరేషన్ కు సహకారం అందించాలన్నారు. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకారమంది చాలన్నారు. కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటి కోసం కృషి చేస్తామని తెలిపారు. చేనేత వస్త్రాలపై 5 శాతం పన్ను మినహాయింపు కోరినట్లు చెప్పారు. కూరగాయలు, పండ్ల ప్యాకింగ్ కర్టన్లపై పన్ను తగ్గించారని మండిపడ్డారు. ఎరువులపై పన్ను తగ్గింపును జీవోఎంకి రీఫర్ చేశారని చెప్పారు. సమస్యలు తగ్గించేలా చాలా అంశాలపై జీఎస్టీ మండలిలో నిర్ణయాలు జరిగాయని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర బ్జడెట్ ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని మంత్రిత్వ శాఖల నుంచి వివరాలు సేకరించి కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశంలో ప్రస్తావించామని చెప్పారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని నిలబెట్టాలి.పరుగులు పెట్టించాలి అన్నది చంద్రబాబు ఆలోచన అని... అది నమ్మారు కాబట్టే ప్రజలు తమకు అధికారం ఇచ్చారని ఉద్ఘాటించారు. 100 కి 93 శాతం రిజల్ట్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి సమయం పడుతుందన్నారు. కొందరు కార్యదర్శుల పదవీకాలం ముగిసిందని చెప్పారు. ప్రజల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోవడానికి ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తాం...అనుమానం అవసరం లేదని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో స్థూలంగా రాష్ట్రానికున్న అవసరాలు, కేంద్రం నుంచి ఆశిస్తున్న ఆర్థిక సహాయం గురించి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు ఏపీ ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఏపీకి ఏం కావాలో ప్రతిపాదనలు ప్రస్తావించానని మంత్రి తెలిపారు. రాష్ట్ర విభజనతో వచ్చిన ఆర్థిక సమస్యలు, గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక నిర్వహణ లోపంతో కలిగిన నష్టాల గురించి ప్రస్తావించానన్నారు. రుణాలు సేకరణ నిరంతరం పక్రియ అని.. రుణ సేకరణపై రిజర్వ్ బ్యాంక్‌తో రాష్ట్ర ప్రభుత్వం చర్చిస్తుందని పేర్కొన్నారు. మెగా రహదారుల నిర్మాణంలో భాగంగా ఏపీలో పరిశ్రమల కారిడార్లను ఏర్పాటు చేయాలని కోరానన్నారు మంత్రి పయ్యావుల కేశవ్. విభజన చట్టంలో ప్రస్తావించిన రామాయపట్నం ఓడరేవు, 'సమీకృత స్టీల్ ఎ÷-లాంట్' నిర్మాణంతో పాటు, 'గ్రేహౌండ్స్' శిక్షణాలయం కోసం ఆర్థిక సహాయం కోరామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వాలని కోరినట్లు మంత్రి వెల్లడించారు. అమరావతి, వెనుకబడిన జిల్లాలకి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్నారు. 5 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న చేనేత రంగాన్ని మినహాయించాలని కోరామన్నారు. 'గ్రీన్ ఎనర్జీ కారిడార్' కు ఏపీకి తోడ్పాటునివ్వాలని కోరినట్లు చెప్పారు. ఆర్థికంగా గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టే సామర్థ్యం చంద్రబాబునాయుడుకు ఉందనే ప్రజలు విశ్వసించి అధికారం అప్పగించారన్నారు. వివాదాలు, చిక్కులు లేని పన్ను ల ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.

# కుప్పం పై చంద్రబాబు దృష్టి



తిరుపతి, జూన్ 24, ఏపీ అసెంబ్లీలో చిట్ట చివరి నియోజకవర్గం కుప్పం. 1989 వరకు బాగా వెనుకబడినప్పటికీ.. సీఎం చంద్రబాబు వరుస విజయాలతో ఆ ప్రాంత అభివృద్ధి దశ తిరిగింది. కుప్పం నుంచి వరుసగా 8వ సారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు 4వ సారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సీఎంగా చంద్రబాబు ఉన్నంత కాలం ప్రతి ప్రాజెక్టు, స్కీం ను ప్రయోగాత్మకంగా ప్రారంభించేందుకు కుప్పం వేదిక అవుతూ వచ్చింది. సీఎం చంద్రబాబు కూడా సొంత నియోజకవర్గానికి హై ప్రియారిటీ ఇస్తూ వచ్చారు. అయితే 2019లో అధికారాన్ని కోల్పోయిన చంద్రబాబు ప్రతిపక్ష నేతగా కుప్పం అభివృద్ధిని చూడలేక పోయారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన హామీలు తీర్చలేకపోయారు. ఇందుకు కుప్పంపై వైసీపీ ప్రభుత్వం వివక్షనే కారణమంటూ ఐదేళ్లుగా ఆరోపిస్తూ వచ్చారు. చంద్రబాబు సొంత ఇలాకాలో ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు.. పలు ప్రాజెక్టులను పూర్తి చేయడమే టార్గెట్?గా చేసుకోబోతున్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పంకు తీసుకొచ్చేందుకు బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనులను చేపట్టి దాదాపు 85 శాతం వరకు పనులను పూర్తి చేశారు. అయితే ఈలోపు అధికారం చంద్రబాబు చేజారి పోగా వైసీపీ సర్కార్ హంద్రీనీవాను పూర్తి చేయలేకపోయింది. అయితే కుప్పంకు హంద్రీనీవా నీటిని తీసుకొచ్చామని చెప్పే ప్రయత్నం వైసీపీ చేసిందని టిడిపి ఆరోపించింది.ఎన్నికలకు ముందు హంద్రీనీవా నీటిని కుప్పంకు విడుదల చేస్తున్నట్లు హడావిడి చేసినా నీళ్లు మాత్రం కుప్పంకు రాకపోవడంతో ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ చంద్రబాబు సర్కార్?కు అత్యంత ముఖ్యం అయింది. దీంతో గత ఐదేళ్లుగా హంద్రీనీవా కాలువ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తూ వచ్చారు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు. హంద్రీనీవాను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నారు. ఇక రామకుప్పం మండలం ననియాల వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టును చేపట్టిన సీఎం చంద్రబాబు 2019 నాటికి దాదాపు పూర్తి చేశారు. అయితే గత 5 ఏళ్లలో టూరిజం పర్యాటకులకు అందుబాటులోకి రాకపోగా ఇప్పుడు 5 ఏళ్ల తర్వాత దాన్ని తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో ఎకో టూరిజం ప్రాజెక్టును పూర్తి చేసి పర్యాటక రంగ అభివృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు భావించారు. శిక్షణ పొందిన ఏనుగులున్న ననియాల ఎలిఫెంట్ క్యాంప్?లో పర్యాటకులను ఆకట్టుకునేలా అంబారీ స్వారీ, విలాసవంతమైన కాటేజీలు, రిసార్టు, హెలిప్యాడ్ నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే ఆ ప్రాజెక్టు గత ఐదేళ్లపాటు నిరుపేయంగానే ఉండిపోవడంతో ఇప్పుడు సీఎం చంద్రబాబు కుప్పం అభివృద్ధిపై చేస్తున్నారు.మరోవైపు కుప్పంలో రహదారుల విస్తరణ, పాలార్ ప్రాజెక్టు కీలకంగా మారింది. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల మధ్య గత కొన్ని దశాబ్దాలుగా అంతరాష్ట్ర సమస్యగా మారిన పాలారు ప్రాజెక్టు పనులకు గత ప్రభుత్వం పాలన అనుమతులను ఇచ్చింది. దాదాపు రూ.140 కోట్లు నిధులు విడుదలకు అనుమతించింది. అయితే పనులు మాత్రం చేపట్టక పోగా కుప్పం మండలం గణేష్ పురం వద్ద పాలారు ప్రాజెక్ట్ పనులు చేపట్టి పూర్తి చేయడం ఇప్పుడు టిడిపి సర్కార్ వంతు అయింది. కుప్పం ? బెంగళూరు మధ్య కనెక్టివిటీ పెంచి శాటిలైట్ సిటీగా మార్చే దిశగా ప్రణాళిక రూపొందించారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు తొలి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. మరోవైపు రామకుప్ప మండలంలో ఏయిర్ పోర్ట్ నిర్మాణానికి భూసేకరణ జరిపినా 2019లో రాష్ట్రంలో అధికారం మారిపోవడంతో ఆ పనులు ముందుకు జరగలేదు. అయితే ఇప్పుడు తిరిగి చంద్రబాబు సీఎం కావడంతో రామకుప్పం శాంతిపురం మండలాల మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులకు లైన్ క్లియర్ అయ్యిందని భావిస్తున్నారు స్థానికులు. ఈ మేరకు త్వరలో నిర్మాణ పనులు కూడా షురూ కానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 25, 26 రెండు రోజులు సీఎంగా చంద్రబాబు కుప్పం పర్యటన చేపట్టబోతున్నారు. ఒక వైపు అభివృద్ధి పనులకే కాకుండా పార్టీ బలోపేతం పట్ల చంద్రబాబు ఫోకస్ పెడుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీ టార్గెట్?గా పెట్టుకున్న చంద్రబాబుకు ఎందుకంత మెజార్టీ రాలేకపోయిందో అన్నదానిపై కూడా ఫోకస్ చేయబోతున్నారు.

# కూల్చివేతపై విమర్శలు చేయటం సరికాదు

**– అనుమతులు ఉంటే చూపించాలి: పల్లా శ్రీనివాస్**

విశాఖపట్నంఎన్నికల్లో ఘోర ఓటమిని మాజీ సీఎం జగన్ జీర్ణించుకోలేక పోతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు.అసెంబ్లీ తొలి సమావేశానికి జగన్ గైర్హాజరవటం సిగ్గుచేటని పల్లా విమర్శించారు.అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేతపై జగన్ విమర్శలు చేయటం సరికాదని, పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు అనుమతులు ఉంటే చూపించాలన్నారు.100 రోజుల్లోనే అక్రమ కేసులను ఎత్తేస్తాం అని పల్లా శ్రీనివాస్ తెలిపారుమాజీ సీఎం జగన్ ఓటమిని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారని విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గత ఎన్నికల్లో 151 స్థానాలు కైవసం చేసుకుని కాలరెగరేసిన జగన్, ఈసారి 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా లేకపోయేసరికి తన హుందాతనాన్ని మరిచిపోయారన్నారు. జగన్ ప్రతి పక్ష హోదా లేకపోయినా సభలో వారి పట్ల హుందాతనంగా ఉండాలని సీఎం చంద్రబాబు చెప్పారని, జగన్ మాత్రం ఆ విధంగా వ్యవహరించడం లేదని శ్రీనివాసరావు అన్నారు. అందుకు అసెంబ్లీ తొలి సమావేశానికి జగన్ గైర్హాజరు కావటమే నిదర్శనమని విమర్శించారు.ప్రజా వేదిక కూల్చి వేతకు శ్రీకారం చుట్టింది వైఎస్సార్సీపీ ప్రభుత్వం అని, అనుమతులు లేని వైఎస్సార్సీపీ కార్యాలయాలను కూల్చివేస్తుంటే తెలుగుదేశంపై జగన్ విమర్శలు చేయటం సరికాదని అన్నారు. అమరావతిలో నీటి పారుదల శాఖ స్థలంలో అనుమతి లేకుండా పార్టీ కార్యాలయం ఎలా కట్టారో వైఎస్సార్సీపీ నాయకులు చెప్పాలన్నారు. ప్రజస్వామ్యయుతంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం, అమరావతి అంశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకార సమయంలో చట్టాలు గౌరవిస్తాను అని చెప్పిన జగన్, మరుసటి రోజునే ఆ మాట మరచి పోయారు అన్నారు. జగన్మోహన్ రెడ్డికి చట్టాలు అంటే గౌరవం ఉంటే ఇకనైనా సభలకు వచ్చి ప్రజాస్వామ్యయుతంగా ప్రవర్తించాలన్నారు.100 రోజుల్లోనే అక్రమ కేసులను ఎత్తేస్తాం: గత అయిదేళ్లలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన రాజకీయ ప్రేరేపిత కేసులను 100 రోజుల్లోనే తొలగిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు వెల్లడించారు. కాకినాడ జిల్లా తునిలో నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య విజయోత్సవ సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రభుత్వంలో భాగస్వాములను చేస్తామన్నారు. కార్యకర్తల కష్టానికి పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు.గత ఐదేళ్లలో కార్మికులకు చెందిన ఎన్నో పథకాలను జగన్ రద్దు చేశారని మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. ప్రజా స్వామ్యాన్ని రక్షించుకోవడంలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమైనదని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. గత ఐదేళ్లలో వందల కోట్లు అక్రమంగా సంపాదించిన నాయకులు అంతా ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని భావించి ఓటమి పాలయారన్నారు. జగన్ ఒంటెద్దు పోకడలకు ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పారని యనమల అన్నారు. యనమల దివ్య విజయోత్సవ సభకు భారీగా అభిమానులు తరలివచ్చారు.



## మెగా జాబ్ మేళాకు భారీ స్పందన

హుస్నాబాద్ యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హుస్నాబాద్ లో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్మన్ ఆకుల రజిత వైస్ చైర్మన్ అయిలేని అనిత, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆర్డీవో శ్రీరామమూర్తి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఇతర అధికారులు పాల్గోన్నారు.ఈ మెగా జాబ్ మేళ కి మంచి స్పందన వచ్చింది. నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరయింది. దాదాపు 60 కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి.5000 ఉద్యోగాల నియామకం చేపట్టడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. జాబ్ మేళా కి వచ్చిన వారికి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి హెల్త్ క్యాంప్ లు, బోజన వసతులు ఏర్పాటు చేసారు.మంత్రి మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా కు జీరో నుండి పీజీ వరకు హుస్నాబాద్ నియోజవర్గం నుండి ఆన్లైన్ లో అప్లై చేసుకున్న వారు 6 వేల మంది ఉన్నారు. హుస్నాబాద్ జీరో టూ పీజీ వరకు జాబ్ మేళా లో పాల్గొనడానికి వచ్చిన వారికి స్వాగతం.కు ఎక్కడ ఏ కంపనీ లో జాబ్ కావాలంటే అక్కడ ఇంటర్వ్యూ కి అటెండ్ కావాలి.తదుపరి జాబ్ మేళా మండల స్థాయిలో నిర్వహిస్తాం. జాబ్ మేళా కోసం వేలాది గా యువత తరలివచ్చారు. వారందరికీ మంచి అవకాశం. మీకు ఉన్న నైపుణ్యం తో కావాల్సిన ఉద్యోగం తో ఇక్కడి నుండి వెళ్ళాలని కోరుతున్న.ఇవే కాకుండా విదేశాల్లో కూడా నర్సింగ్ ,నిర్మాణ రంగం,ఇతర రంగాల్లో లక్షల్లో జీతాలు వచ్చే ఉద్యోగాలు ఉన్నాయి.మండలాల వారిగా ఇలాంటివి ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల వారికి కూడా ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాత్రి 10 అయినా సరే ఇక్కడే ఉండి ఓపికగా ఇంటర్వ్యూ అటెండ్ కావాలి. హుస్నాబాద్ లో మొదటిసారి జాబ్ మేళా జరుగుతుంది. ప్రభుత్వం నుండి పకడ్బందీగా జాబ్ మేళా నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులకు దాదాపు ఉద్యోగాలు వచ్చేలా అవకాశాలు కల్పించాలి. ఇవే కాకుండా పాల ఉత్పత్తి, చేపల పెంపకం, గ్రామీణ పరిశ్రమలు కల్పించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి టూరిజం గా కూడా అభివృద్ధి చేస్తాం. ఎవరు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి. అందరూ మంచిగా ఇంటర్వ్యూ చేస్తూ ఉద్యోగాలు పొందే లెటర్ లతో పోవాలి. ఉద్యోగాలు పొందే యువతకు అందరికీ శుభాకాంక్షలని అన్నారు.

## చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం?

నాగర్ కర్నూల్ జూన్ 24చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం? వెలుగులోకి వచ్చింది. భూమి అమ్మడం లేదని 20 రోజుల క్రితం ఈశ్వరమ్మ మామ నాగన్నను హత్య చేసిన విషయం ఇవాళ వెలుగు చూసింది . చెంచుల భూముల పై కొంత మంది గ్రామస్థులు కన్నేశారు. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న (56)కు చెందిన 2.5 ఎకరాల భూమిని బండి వెంకటేష్ ఎకరా రూ. 20 లక్షలు పలుకుతుండగా రూ. 4.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అందుకు నాగన్న ఒప్పుకోకపోవడంతో గ్రామ శివారులో అతడిని హత్య చేశారు. శవ పరీక్ష నిర్వహించకుండానే అంత్యక్రియలు చేశారు. భూతగాదా నేపథ్యంలో నాగన్నను హత్య చేసి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూమిని దక్కించుకునేందుకు నాగన్న హత్య చేసేందుకు కూడా వెనకడలేదన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి. చెంచు మహిళ ఈశ్వరమ్మ భూమిని కౌలు తీసుకున్న వ్యక్తులు ఆమెపై పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే.నాగర్ కర్నూల్ ? కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో బాధితురాలు చెంచు మహిళ ఈశ్వరమ్మ, భర్త ఈదన్న తమ వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ఆ భూమిలో వెంకటేశ్ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం పెట్టుకోగా తన దగ్గరే ఈదన్న, బాధితురాలు ఈశ్వరమ్మ పని చేసేవారు. ఈశ్వరమ్మ పనికి రావడంలేదని ఆమె మర్మంగాలపై కారం చల్లి, డీజిల్ పోసి నిప్పంటించి పాశవికంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈశ్వరమ్మ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నిమ్స్ లో ఈశ్వరమ్మను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులకు ఆదేశించారు

# స్వర్ణముఖిలో చెక్‌డ్యామ్‌కు లభించని మోక్షం

### ప్రతిపాదనలకే పరిమితం అయిన నిర్మాణాలు

అనంతపురం,జూన్24 : స్వర్ణముఖి నదిలో నీరు లేకపోతే భూగర్భ జలాలు కూడా ఇంకిపోతున్నాయి. ఇందులో తలపెట్టిన చెక్‌డ్యామ్‌ల వల్ల నీరు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తక్షణం వీటినిచేపట్టాలని కోరుతున్నారు. అయితే రెండు చోట్ల తలపెట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమాయ్యాయి. అగళి మండలంలో స్వర్ణముఖి నది పరిసర ప్రాంతాలలోని బొమ్మరసనపల్లి, రాగేనింగనహళ్లిలతో పాటు మరో నాలుగు గ్రామాలలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. వెయ్యి అడుగులు తవ్వించినా చుక్కనీరు దొరకడం కష్టసాధ్యంగా మారింది. ఎటువంటి సాగునీటి వనరులు లేకపోవడంతో ఆ ప్రాంత రైతులు వర్షాధారిత పంటలపైనే ఆధారపడుతున్నారు. దశాబ్దకాలంగా సరైన వర్షాలు కురవకపోవడం, చెరువులు, కుంటలకు నీరు చేరకపోవడం, కురిసిన వర్షపు కూడా వృథా అవుతుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి ఉన్న బోరుబావులు ఎండిపోతున్నాయి. కర్ణాటక సరిహద్దులోని అగళి ప్రాంతంలో స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ప్రవహించిన కొద్ది రోజులు ఆ పరిసర ప్రాంతాలలో భూగర్భజలాలు పెంపొందుతాయి. మళ్లీ భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటిఎద్దడి తీవ్రరూపం దాల్చుతోంది. నది సమీపంలోని గ్రామాలలో కూడా తాగు, సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. అక్కడక్కడ ఉన్న తోటలు కూడా ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంతమంది రైతులు వేసవిలో తోటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి తడులు పెట్టుకున్నారు. స్వర్ణముఖి నదిలో సబ్‌సర్ఫేస్ చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు పరిశీలించారు. ఆ నదిలో రెండు చోట్ల ఈ చెక్‌డ్యాం నిర్మాణాలు చేపడితే ఒక్కొక్క చెక్‌డ్యాం పరిధిలో కిలోమీటరు వరకు భూగర్భజలాలు పెంపొందుకు అవకాశముంటుందని సంబంధిత శాఖ అధికారుల సమాచారం. ఇందుకు సంబంధించి గ్రౌండ్ వాట ర్ లెవల్ డిపార్టుమెంట్ అధికారులు కూడా పరిశీలించి చెక్‌డ్యాంల నిర్మాణానికి క్లియరెన్స్ ఇచ్చారు. దీంతో ఇరిగేషన్‌శాఖ వారు రెండు చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటి వరకు నిధులు మంజూ రు కాలేదు.

# భోజన కార్మికులకు బకాయిలు - అందని బిల్లులతో అవస్థలు

అనంతపురం,జూన్24 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అయితే పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీ నిర్వాహకులునాలుగునెలల నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులు ఆకలి తీరుస్తున్నామంటూ వాపోతున్నారు. అరకొరగా వచ్చే ఆదాయంతో ఏజెన్సీలు నిర్వహించలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నప్పటికీ బిల్లులు మాత్రం అందడం లేదన్నారు. మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలు చొప్పున మొత్తం 38 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీ నిర్వాహకులకు బిల్లులు దాదాపు అందాల్సి ఉంది. బిల్లుల కోసం మండల అధికారులు పైస్థాయి అధికారులకు ప్రతిపాదన లు పంపినప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదం టున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ప్రతి రోజూ విద్యార్థులకు భోజనం వండేందుకు అవసర మైన సరుకుల కోసం బయటి వ్యక్తులతో వేలకు వేల రూపాయలు వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ భోజనాన్ని అందిస్తున్నామన్నారు.

# పార్లమెంట్‌కు సైకిల్‌పై చేరుకున్న అప్పలనాయుడు

### విజయనగరం నుంచి తొలిసారిగా ఎంపిగా ఎన్నికల

న్యూఢిల్లీ,జూన్ 24 (ఆర్‌ఎన్ఎ): పార్లమెంట్ సమావేశాల తొలి రోజు ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు పార్లమెంట్‌కు సైకిల్‌పై చేరుకున్నారు. లోక్‌సభలో తొలిసారి అప్పలనాయుడు అడుగుపెట్టారు. ఢిల్లీలో తన అతిథి గృహం నుంచి సైకిల్‌పై పార్లమెంట్‌కు చేరుకున్నారు. సైకిల్ గుర్తుపై ఎంపీగా గెలిచిన విజయనగరం ఎంపీ మొదటి రోజు పార్లమెంట్‌లో అడుగు పెడుతున్న వేళ ఇలా సైకిల్‌పై చేరుకున్నారు. కలిశెట్టి అప్పలనాయుడు 15 లక్షల 68 వేల ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా ఓ సాధారణ వ్యక్తిలా ఇలా సైకిల్‌పై లోక్‌సభకు చేరుకున్నారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు భారీ మెజార్టీతో విజయం సాధించారు. సమీప వైసీపీ అభ్యర్థిపై 2 లక్షల 29 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు.




# పండుగలా ఫించను కార్యక్రమం




విజయవాడ, జూన్ 24, ఏపీలో కొత్త ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ పై కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతూ ఫైల్ పై చంద్రబాబు సంతకం చేసిన సంగతి తెలిసింది. ఈనెల నుంచి నాలుగు వేల రూపాయల పింఛన్ లబ్ధిదారులకు అందం ఉంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఏప్రిల్ నుంచి ఈ పెంపుదల వర్తింపజేయనున్నారు. నాలుగు వేల రూపాయల పింఛన్ మొత్తం తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెల కు సంబంధించి పెండింగ్ మూడు వేల రూపాయలు అందించనున్నారు. మొత్తంగా కలిపి రూ.7000 పింఛన్ లబ్ధిదారులకు అందనుంది. అయితే వాలంటీర్లతో పంపిణీ చేయాలా? ప్రభుత్వ సిబ్బందితో అందించాలా? అన్నదానిపై చర్చ జరుగుతోంది.ఈ ఎన్నికల్లో పింఛన్ల అంశం ప్రధాన హామీగా మారింది. రాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని 3,500 పెంచుతామని జగన్ హామీ ఇచ్చారు. అది కూడా రెండు విడతల్లో 250 చొప్పున పెంచుతామని చెప్పుకొచ్చారు.అయితే చంద్రబాబు మాత్రం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నాలుగు వేల రూపాయల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. అది కూడా ఏప్రిల్ నుంచి మూడు నెలల పాటు పెండింగ్ మొత్తాన్ని కూడా జూలైలో చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి రావడంతో జూలై 1న పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచుతూ అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. కొత్త పింఛన్ పుస్తకాలతో పాటు నగదు అందించాలని ఆదేశించారు.వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు ?4,000 పింఛన్ అందునుంది. అదేవిధంగా ట్రాన్స్ జెండర్లు, గీత కార్మికులు, మత్స్యకార వర్గాలకు 4000 రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దివ్యాంగులకు మూడు వేల నుంచి 6 వేలకు, పూర్తిస్థాయి దివ్యాంగులకు ఐదు నుంచి 15 వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచనున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి ఐదు వేల నుంచి పదివేలకు పింఛన్ మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల ఒకటి నుంచి ఈ పెంపుదల అమలు కానుంది. అయితే ఈ పింఛన్లను వాలంటీర్ల ద్వారా అందించాలా? లేకుంటే సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలా అన్నది ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 24న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది. ఈనెల పెన్షన్లకు సంబంధించి ఎటువంటి నగదు సమస్య లేదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. లై ఒకటో తేదీన ఇంటి వద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు ఏ ఇబ్బంది కలగకూడదని భావించి ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేపడుతున్నామని ఏపీ బీసీ, చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత చెప్పారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పెనుగొండ నియోజకవర్గానికి వచ్చిన టీడీపీ నాయకురాలు సవితకు పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారుబెంగళూరు విమానాశ్రయం నుంచి వయా సోమందేపల్లి, పెనుగొండ పట్టణము వరకు 6 గంటల పాటు సుదీర్ఘంగా మంత్రి సవిత ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీ మంత్రి సవిత మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలుపుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృద్ధిపై నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చేనేతకు పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేనేత కార్మికుల బతుకుల్లో అభివృద్ధి వెలుగులు విరజిల్లుతాయన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, రాయితీ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మంది పదవి ఇచ్చినందుకు చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు ఇచ్చిన బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి శాఖలలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ నియోజకవర్గంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేస్తానని, తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను అన్నారు. త్వరలో బిసి కమీషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్లలో వెనకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రంపై తొలి సంతకం చేశామన్నారు

# మదనపల్లి రైతులకు మంచి రోజులు



తిరుపతి, జూన్ 24, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టమోటా పంట ఎక్కువగా పండుతుంది. ఇక్కడ ఎర్రబంగారంగా పిలుచుకునే ఈ టమోటో పంటకు మదనపల్లి మార్కెట్ ఆసియా ఖండంలోనే అత్యధిక టమోటో ఉత్పత్తి చేసే మార్కెట్ గా పేరు సంపాదించింది. గత కొన్ని రోజులుగా టమోట ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారింది. గత ఏడాది మార్కెట్లో టమోటా ధర రూ.200 దాటడం తెలిసిందే. ఏ రాష్ట్రంలోనూ టమోటా అంతగా లేదుదేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల టమోటో పంట సాగు చేస్తున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే పశ్చిమ ప్రాంతమైన మదనపల్లి సమీపంలోని మండలాల్లో అత్యధికంగా టమోటా పడ్డ సాగుతుంది. గత ఏడాది జూన్ నెలలో 14 వేల క్వింటాళ్ల సరుకు మదనపల్లి మార్కెట్ నుంచి వెళ్లింది. ఈ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో టమోటో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని మార్కెట్ కమిటీలు సైతం టమోట మార్కెట్లు నిర్వహిస్తోంది అంటే ఏంత మేర పంట సాగవుతుందో అర్థమవుతోంది.నైరుతి రుతుపవనాల రాకతో దక్షిణాదిన పలు రాష్ట్రాలలో వర్షాలు ప్రారంభమయ్యాయి. వర్షాలు పడ్డాయని సంతోషించే లోపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంట నీటిపాలు అయ్యింది. అనుకోని విధంగా తెల్ల పురుగు వైరస్ సోకి పంట దిగుబడి తగ్గిపోయింది. గాలుల ప్రభావం తో పంట నేలపాలు కాగా వర్షం నీటిలో పడి అవి పాడైపోయి పంట నష్టం వాటిల్లింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా టమోట రైతులకు మాత్రం వర్షా కాలం తక్కువ వర్షాలు కురవడం అదృష్టంగా చెపొచ్చు. పలు రాష్ట్రాల్లో టమోటో ఉత్పత్తి తగ్గడంతో జిల్లాలోని టమోటా రైతుల పంటకు మంచి ధర వస్తుంది. ఇక్కడ కూడా పంట దిగుబడి తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే జూన్ వరకు 5 నుంచి 7వేల మెట్రిక్ టన్నుల సరుకు మాత్రమే మదనపల్లి మార్కెట్ కు వచ్చింది.కొన్ని సంవత్సరాల కాలంగా టమోటో సాగు చేస్తున్న రైతులు తక్కువ ధర.. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో రోడ్డుపై పారవేసి ఆత్మహత్యలకు పూనుకున్న పరిస్థితుల నుంచి ప్రస్తుతం లాభాల బాటకు రైతులు వెళుతున్నారు. అయితే గతంలో నష్టపోయిన పరిస్థితి నుంచి అప్పులు తీర్చుకోవడానికి మాత్రమే ఈ టమోటా అధిక ధర ఉపయోగపడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే త్వరలో కొత్త పంట చేతికి అంది వచ్చే అవకాశం ఉన్న క్రమంలో రైతుల మద్దతు ధరను కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని మాత్రం రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.ఆసియా ఖండంలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ గా మదనపల్లె టమోటా మార్కెట్ గుర్తింపు పొందింది. మదనపల్లె మార్కెట్ నుంచి ఆశా ఖండంలోని వివిధ దేశాలకు టమోటా ఎగువతులు జరుగుతుంటాయి. ఇతర దేశాలు రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, దళారుల ఇష్టానుసారం ధరలు పెంచి అక్కడ మరింత అధిక రేట్లు అమ్ముకునే విధంగా ఇక్కడ కొనుగోలు చేస్తున్నారు. అదే కారణంతో రాష్ట్రం వ్యాప్తంగా టమోటా ధరలు అత్యధికంగా పెరిగాయి. రాష్ట్రంలో ప్రస్తుతం మార్కెట్ ధర 100 నుంచి 120 వరకు పెరగగా, మార్కెట్ ధరతో పాటు దళారి వ్యవస్థ తీవ్రంగా రైతుల పాలిట శాపంగా మారింది. రైతులకు గిట్టుబాటు ధర మాత్రమే అందిస్తూ వారి కడుపు కొడుతున్నారు. ప్రస్తుతం 25 కేజీల టమోటో బాక్సు 2200 నుంచి 2500 వరకు పంట దిగుబడి బట్టి వేలంలో పాడుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కాకుండా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్ గఢ్, ఒరిస్సా, బిహార్, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, బాంగ్లాదేశ్, బొంబాయి ఇలా ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. జూలై రెండో వారం వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం కనబడుతుంది.రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్లో టమోట ధరలు మండిపోతున్నాయి. కొన్ని చోట్ల కిలో 80 నుంచి 100 పలుకుతుంది. పంట దిగుబడి తగ్గి ధరలు పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందించే సబ్సిడి ధరకు విక్రయాలు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ కు ఆదేశాలు జారీ చేసింది. అదే తడవుగా రాష్ట్రంలోని రైతు బజార్లకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి టమోట పంటను రూ. 55 నుంచి 60 లోపు కొనుగోలు చేసి పంపారు. పది రోజుల్లో 30 టన్నుల టమోటలను కొని కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు పంపిణీ చేస్తారు. ఈ ప్రక్రియ కోసం ప్రతి జిల్లాకు ఐదు లక్షలు రూపాయలు రివర్స్ఇన్ ఫన్ ఇవ్వబోతున్నారు. చాల జిల్లాలకు ఈ పంట చేరుకున్న ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో సబ్సిడీ పంట ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీని పై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని నూతన ప్రభుత్వానికి ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తోంది

# అధ్వాన్నంగా గ్రామీణ రోడ్లు - వర్షాలతో దెబ్బతిన్న రహదారులు

కడప,జూన్ 24(ఆర్‌ఎన్ఎ): గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో వేసిన నూతన తారురోడ్లు సైతం గతంలో కురిసిన వర్షం దెబ్బకు రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా మారాయి. ప్రధానంగా రాయచోటి మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే దారులు అడ్డదిడ్డంగా మారాయి. రాయచోటి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల పరిధిలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట పరిధిలోని సుండుపల్లె, వీరబల్లి మండలాల్లో కూడా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా అధ్వానస్థితిలో ఉన్నాయి. తారురోడ్డు పూర్తి స్థాయిలో తారు లేచిపోయి కంకరు తేలి రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఆ మార్గంలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తారురోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టుల వద్ద మట్టిని తోలకుండా అలాగే వదిలేయడంతో వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ అధికారులతో పాటు సంబంధిత కాంట్రాక్టర్లకు, నాయకులకు చెప్పినా ప్రజల గోడును పట్టించుకున్న పాపనపోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. వరదలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అటు ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ, పంచాయతీరాజ్ అధికారులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ రాజ్‌శాఖ కింద చేపట్టి పూర్తి స్థాయిలో దెబ్బతిన్న రోడ్డు ఏర్పాటు చేసేందుకు అవసరమైన నివేదికలను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. తారురోడ్డు కోతకు గురై దెబ్బతినడంతో వాహనదారులు రాత్రి సమయాల్లో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకుని దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

# బిసి హాస్టళ్లలో సమస్యల తిష్ట

కర్నూలు,జూన్ 24 : సంక్షేమ హాస్టల్ విద్యార్థులను సమస్యలు వేధిస్తున్నాయి. హాస్టల్ నిర్వహణ అంతా అక్కడి సిబ్బందే చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు వడ్డించే మెనూ కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల తాగునీరు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. భోజనం సమయంలో గుక్కెడు నీటి కోసం పక్కవారిని ఆశ్రయించి దాహం తీర్చుకుం టున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఆరుబయట తీరుగుతున్నా పట్టించుకునే వారు కరువ య్యారు. ఈ సమయంలో జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. హాస్టల్లో దోమల బెడదతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జర్వాలు వచ్చి బాధపడుతునా సరైన చికిత్స అందడం లేదని ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నా వాటిని సక్రమంగా వినియోగించుకోవడం లేదు. రాత్రి సమయంలో విద్యార్థులు అరుబయటకు వెళ్లి ప్రమాదంలో తెచ్చుకొనే పరిస్థితి ఉంది. ఇప్పటికైె ఉన్నతాధి కారులు స్పందించి సమస్యలను పరిష్కారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# డిప్యూటీ స్పీకర్ బరిలో ఎవరు

విజయవాడ, జూన్ 24, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు కండువాలతో వచ్చిన సభ్యులతో సభ కళకళలాడింది. ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే నామినేషన్ రావడంతో అయ్యన్నపాత్రుడి ఎన్నిక ఏకగ్రీవమైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎమ్మెల్యేను స్పీకర్‌గా ప్రకటించారు అధికారులు. అయ్యన్న.. సభలో ఉన్న కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత సీనియర్. ఇప్పటి వరకు 7 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒకసారి అనకాపల్లి ఎంపీగానూ విజయం సాధించారు. పలు శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.డిప్యూటీ స్పీకర్ పదవి ఎవరికి దక్కబోతుందన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది. స్పీకర్ చైర్ టీడీపీకి దక్కింది, డిప్యూటీ స్పీకర్ పదవి మిత్రపక్షాలకు ఇస్తారా అన్న చర్చ నడుస్తోంది. దీనిపై కూటమి పార్టీల మధ్య పెద్ద ఎత్తున డిస్కషన్ సాగుతోంది. ఇక్కడ కొన్ని సమీకరణాలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడికి స్పీకర్ పదవి దక్కింది. రాయదర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులుకు డిప్యూటీ దక్కే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. కాల్వ కూడా టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. రెండు పదవులు బీసీలకు ఇవ్వడం ద్వారా కూటమి బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందనే సంకేతాలు తీసుకెళ్లేలా అధినేతలు కసరత్తు చేస్తున్నారు. లేదంటే జనసేన కూడా దక్కే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో మూడు పార్టీల మధ్య చర్చలు నడుస్తున్నాయి. జనసేనకు ఇస్తే ఓసీ సామాజిక వర్గానికి చెందిన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవికి ఇస్తారనేది టాక్.దీనికి మించి మరో లెక్క కూడా లేకపోలేదు. స్పీకర్, డిప్యూటీ ఒకే ప్రాంతానికి చెందిన వారికి రెండు పదవులు ఇవ్వకుండా వేరు వేరు ప్రాంతాలకు ఇవ్వడం ద్వారా అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందని అధినేతలు లెక్కలు వేస్తున్నారు. ఇక పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకు చీఫ్ విప్ దక్కే అవకాశం ఉన్నట్లు సభ్యుల మధ్య చర్చ నడుస్తోంది. తొలిరోజు సభలో 171 మందితో ప్రమాణం చేయించారు ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యచౌదరి. వ్యక్తిగత కారణాలతో ప్రమాణం చేయని ముగ్గురు ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, పితాని సత్యనారాయణ, వనమాడి వెంకటేశ్వరరావు రెండో రోజు సభలో ప్రమాణం చేస్తారు. సభ్యుల ప్రమాణం తర్వాత సభలో స్పీకర్ పేరు ప్రకటిస్తారు.తొలి రోజు సభలో ఉద్విగ్న క్షణాలు కనిపించాయి. బాలకృష్ణతో కలిసి వచ్చిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీ మెట్లపై ప్రణమిల్లారు. రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలో చంద్రబాబు అడుగుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎంకు స్వాగతం పలికారు. అంతకు ముందు ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరిన చంద్రబాబు.. వెంకటపాలెంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసెంబ్లీ హాల్‌లో అడుగుపెట్టిన చంద్రబాబు-పవన్ ఆలింగనం చేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సీఎం చంద్రబాబుతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం స్వీకారం చేయించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. నారాలోకేష్‌తోపాటు మిగతా మంత్రులు ప్రమాణం చేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వైఎస్ జగన్.. ప్రొటెం స్పీకర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఫిర్యాదులుపై విచారణ జరిపి చట్ట పరిదిలో న్యాయం చేస్తాం......: జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి

నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం (24-06-2024) నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పి. జి ఆర్. ఎస్) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఫిర్యాదిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర ,ఎస్పీ సిసి నాగరాజు పాల్గొన్నారు.

## మాన్యం భూములకు వేలం 5 లక్షల 6వేలఆదాయం.వేలం పాటలను నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–మండల పరిధిలోని చిలకలూరు గ్రామంలో వెలిసిన చెన్నకేశవ స్వామి, ఈశ్వర స్వామి దేవాలయములకు చెందిన భూములకు సోమవారం వేలం పాటలు నిర్వహించగా రూ 5లక్షల 6 వేల రూపాయలు వచ్చిందని దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల మేరకు చెన్నకేశవ స్వామి, ఈశ్వర స్వామి దేవాలయాలకు చెందిన 38,99 సెంట్ల భూములకు బహిరంగ వేలం పాటలను నిర్వహించగా 5లక్షల ఆరువేల రూపాయలు వచ్చిందన్నారు. గత ఏడాది కంటే 50వేల రూపాయలు అదనంగా వచ్చిందని ఆయన తెలిపారు. ఈ వేలం పాటలలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ హరిచంద్ర రెడ్డి, సిబ్బంది పలువురు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

**అతిసార వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి. సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడీవో రామచంద్ర. అధికారులు.**



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–అతిసార వ్యాధిపట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచంద్ర, యు ఓ పి ఆర్ డి శ్రీనివాస శర్మ, ఆర్డబ్ల్యూసీ ప్రమోద్ తెలిపారు. సోమవారం ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అతిసార నివారణ సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాలలో ప్రజలకు అతిసార వ్యాధి లక్షణాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు త్రాగు నీటి సరఫరా ట్యాంకులను క్లోరినేషన్ చేయించి శుభ్రంగా కడిగించాలన్నారు. త్రాగునీటి సరఫరా చేసే పైపులు ఎక్కడైనా లీకేజీ ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాలలో ఎక్కడ మురికినీరు నిలువ చేరకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నీరు ఉన్నట్లయితే అక్కడ నీరు కలుషితం కాకుండా దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ వేస్ట్ ఆయిల్ చల్లించాలన్నారు. ప్రజలకు ఎక్కడైనా వాంతులు విరేచనాలు అవుతూ ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకోవాలన్నారు. అతిసార వ్యాధి లక్షణాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో పిఆర్ఏఈ వెంకటరాముడు, ఈవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం



శ్రీ ప్రస్థానం–గడివేముల :– జూన్ 25:–వాలంటీర్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెన్షన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెడుతూ.. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్ల పంపిణీ చేయించాలని నిర్ణయించింది. 1వ తేదీన సచివాలయ ఉద్యోగుల చేత పెన్షన్ డోర్ డెలివరీ చేయనుంది. అన్ని రకాల పెన్షన్లు సచివాలయ ఉద్యోగులతోనే పంపిణీ చేయనున్నామని.. వాలంటీర్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి పార్థసారథి తెలిపారు. జులై 1న సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ పంపిణీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. వాలంటీర్ వ్యవస్థని కొనసాగిస్తూ.. రూ.10 వేలు జీతం ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థకి మంగళం పాడే దిశగా చంద్రబాబు సర్కార్ తీసుకుంటుంది" అని వైఎస్సార్‌సీపీ ట్వీట్ చేసింది. వెలకట్టలేని అభిమానంతో గత ప్రభుత్వంలో జగనన్న సైన్యంలా వలంటీర్లు పని చేసిన సంగతి తెలిసిందే. వలంటీర్ల వ్యవస్థనే నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులైన ప్రతి ఒక్కరికీ అందేలా, ఇంటింటికి వెళ్లి అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు.

# తుమ్మలపెంట పాఠశాల లో పూర్వ విద్యార్థుల ఔదార్యం






శ్రీ ప్రస్తానం,కొలిమిగుండ్ల, జూన్ 24:నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు మరియు అంగన్వాడి కేంద్రాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అదే పాఠశాలలో గతంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కలిసి 130 మంది విద్యార్థులకు పలకలు, భోజనం తినే ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకుంటున్న సమయంలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహించిన యల్లసుబ్బయ్య, ఉపాధ్యాయులు వెంకటేష్, హరిబాబు, నాగయ్య, శ్రీను గోపాల రెడ్డి,హరినారాయణ లు ఉండేవారని వారు నేర్పించిన విద్య, సంస్కారం,విధేయత మా జీవితాలలో వెలుగులు నింపాయని తాము తమ వృత్తులలో ఎంత బిజీగా ఉన్నా చదువుకున్న పాఠశాలకు ఏదో ఒక మంచి పనిచేయలనే సంకల్పంతో దాదాపు చాలా సంవత్సరాల నుండి కొన్ని సేవ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అందులో భాగంగా నేడు తుమ్మలపెంట లోని పాఠశాలలలో, అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని అలాగే తమకు విద్య నేర్పిన గురువులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట శివశంకర్ రెడ్డి, బాయికటి హుసేన్ వలి,పూలరంగడు,షాషావలి,అక్బర్,రాకేష్, వెంకటేష్,రామ్ మోహన్,హుసేన్ వలి, సుధీర్, నాగ రంగయ్య,మహబూబ్ పీరా,ఐటిఐ బ్యాచ్ సాంబ శివ,శబరిష్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు..

# అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడీవో రామచంద్ర. అధికారులు.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–అతిసార వ్యాధిపట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచంద్ర, యు ఓ పి ఆర్ డి శ్రీనివాస శర్మ, ఆర్డబ్ల్యూసీ ప్రమోద్ తెలిపారు. సోమవారం ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అతిసార నివారణ సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాలలో ప్రజలకు అతిసార వ్యాధి లక్షణాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు త్రాగు నీటి సరఫరా ట్యాంకులను క్లోరినేషన్ చేయించి శుభ్రంగా కడిగించాలన్నారు. త్రాగునీటి సరఫరా చేసే పైపులు ఎక్కడైనా లీకేజీ ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాలలో ఎక్కడ మురికినీరు నిలువ చేరకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నీరు ఉన్నట్లయితే అక్కడ నీరు కలుషితం కాకుండా దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ వేస్ట్ ఆయిల్ చల్లించాలన్నారు. ప్రజలకు ఎక్కడైనా వాంతులు విరేచనాలు అవుతూ ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకోవాలన్నారు. అతిసార వ్యాధి లక్షణాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో పిఆర్ఏఈ వెంకటరాముడు, ఈవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# టిడిపి ప్రభుత్వ హయాంలో నైనా దొర్నిపాడు తహశీల్దార్ కార్యాలయానికి మోక్షం లభించేనా...







దొర్ని పాడు,జూన్:24, శ్రీ ప్రస్థానం, న్యూస్:– జీవిత కాలం ముగిసి శిథిలావస్థలో ఉన్న దొర్ని పాడు తహ సీల్దార్ కార్యాలయానికి కనీసం ప్రస్తుతం టీడిపి హయాంలోనైనా నూతన భవనాన్ని నిర్మించేందుకు మోక్షం లభించనుందా అని అధికారులు స్థానిక ప్రజలు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.. 2014 లో అప్పటి అధికారంలో ఉన్న తెలుగదేశం పార్టీ హయాంలో మంత్రిగా ఉన్న భూమా ఆఖిల ప్రియ, శిథిల అవస్థలో ఉన్న తహశీల్దారు కార్యాలయం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు సుమారు రూ.90 లక్షలు హెచ్చించి.. వీలైనంత త్వరగా నిర్మాణ పనులను చేపట్టాలనే ఉద్దేశ్యంతో ,2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించే సమయాల్లో ఆమె చేతుల మీదుగా శంకు స్థాపన కూడా చేశారు.. అనంతరం పాత భవనాన్ని పోక్లైన్ల నద్వారా గోడలు కూడా కూల్చి వేశారు..అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపద్యంలో నిర్మాణ పనులు నిలుపుదల అయ్యాయి దీంతో ఎమ్మార్వో ,తో సహా సిబ్బంది మొత్తం ప్రక్కనే ఉన్న ఎంపీడీఓ.కార్యాలయంలో విధులు నిర్వర్తించే పరిస్థితి నెలకొంది..2019 లో వైసిపి తరపున ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గా గెలిచినా గంగుల బీజెంద్ర రెడ్డి, 5 సం"లు పాలన కొనసాగించినపటికిని చొరువ తీసుకొని నూతన భవనాన్ని నిర్మించేందుకు మొగ్గు చూపుతారేమో నని అధికారులు అందరూ అనుకున్నారు... టిడిపి హయాంలో నే కదా శంకు స్థాపన జరిగింది మనకెందుకులే అనుకున్నారో ఏమో కానీ కనీసం శిథిలవస్థలో ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించడం కానీ కనీసం కన్నెత్తి కూడా చూసే పాపాన లేకపోలేదు...2019 – 24 వరకు కొనసాగిన వైసిపి పాలనలో ప్రజా ప్రతినిధులు సైతం పాటు బడిన తహశీల్దార్ కార్యాలయాన్ని పట్టించుకోక పోవడం వల్ల అక్కడి ప్రాంగణంలో చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలతో అల్లుక పోయి చీ మలు దూరని చిట్టడవినీ తలపించేలా చాలా భయానిక స్థితిలో ఉందనీ స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇప్పటైన సంబంధిత శాఖ అదికారులు చొరువ తీసుకొని శంకు స్థాపన చేసిన అప్పటి మాజీ మంత్రి ప్రస్తుత ఆళ్లగడ్డ టీడిపి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ,దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నూతన భవన నిర్మాణ పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులకు నివేదిస్తూ విజ్ఞప్తులు చేస్తున్నారు...

# ప్రభుత్వ విద్యాసంస్థలు గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సీట్లు పెంచాలి

**మండల కేంద్రంలో మూతపడిన డి. ఎన్.టి. వసతి గృహాన్ని పునఃప్రారంభించాలి**

**అధికారులు స్పందించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తాం**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్**



కర్నూలు కందనవోలు జూన్ 24 న్యూస్:ప్రభుత్వ విద్యాసంస్థలైన గురుకుల, కేజీబీవీ,ఆదర్శ పాఠశాలల్లో సీట్లు పెంచాలని,మండల కేంద్రంలో మూతపడిన ప్రభుత్వ డి.ఎన్.టి వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ కోరారు.సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి వినతిపత్రాన్ని సమర్పించారుఅనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే కరువు,కాటకాలతో సతమతమవుతున్న కర్నూలు జిల్లా అత్యంత వెనకబడిన ప్రాంతమని అన్నారు,రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఉందని, ఉపాధి లభించక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని అన్నారు.ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళే సందర్భంలో వారి పిల్లలను ఇంటి దగ్గరే వదిలి వెళ్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్న,ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో కేవలం ఒకే డి.ఎన్.టి. ఉంటే,నిర్వహణ లోపంతో దానిని కూడా మూసివేయడం జరిగిందని అన్నారు.అందువలన ప్రైవేట్ విద్యాసంస్థలల్లో చదివించే స్తోమత లేక,తల్లిదండ్రులతో పాటు పిల్లలను ఉపాధి కి తీసుకెళ్తే,పిల్లలు కూడా బాలకార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లాలో ఇప్పటికే విద్యాప్రమాణ స్థాయిలు తగ్గిపోయాయని,నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని అన్నారు.నిరక్షరాస్యత తగ్గించేందుకు నూతన విద్యాసంస్థలు ఏర్పాటుకు చర్యలు తీసుకోకుండా ఉన్న విద్యాసంస్థలను,వసతి గృహాలను మూసివేయడం జరుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు



23.06.2024 అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ. 2,00,016/–లను శ్రీ టి.అర్.ఎం. శర్మ, హైద్రాబాద్ వారు అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్య నిర్వహణ అధికారి జి స్వాములు, పర్యవేక్షకులు టి. హిమబిందులకు అందజేయడం జరిగింది.



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు ఈరోజు ఉదయం శ్రీశైలం బ్రహ్మం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు వీరికి ఆలయ ఈవో పెద్దిరాజు గారు స్వాగతం పలికారు



ఇంతవరకు రాష్ట్రంలో రైతులకు ప్రతి సంవత్సరం పంటలు నష్టపోయినటువంటి వారికి పంటల బీమా డబ్బులు ఇవ్వలేదని తక్షణమే ఇన్సూరెన్స్ డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సృజన గారికి వినతిపత్రం ఇవ్వడంజరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ రైతుల ఆర్థిక పరిస్థితి ఏమీ బాగాలేదని, గత సంవత్సరం తీవ్రంగా పంటలు నష్టపోయిన. కర్నూలు జిల్లాలో మరియు రాష్ట్రంలో గత సంవత్సరం ఖరీఫ్,రబీ సీజన్లో వేసినటువంటి పంటలు నష్టమయ్యాయి . ఒక ఎకరానికి 50 వేల రూపాయల నుండి 2 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. రైతులు భారీ స్థాయిలో నష్టపోయారు. ఇలాంటి పరిస్థితులలో రైతులను ఆదుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం. ఇంతవరకు ఇన్సూరెన్స్ డబ్బులు రాలేదు. గత సంవత్సరం ఖరీఫ్,రబి లో వేసిన పంటలు పూర్తిగా నష్టమయ్యాయి. జిల్లా యంత్రాంగమే కర్నూలు జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించింది. రైతులకు రావాల్సిన ఇన్సూరెన్స్ రాలేదు. గత సంవత్సరం పెట్టుబడులు పెట్టినా పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. రైతుల దగ్గర వ్యవసాయం చేయటానికి సరిపడినన్ని డబ్బులు లేవు. గత సంవత్సరం గతంలో ఉన్న ప్రభుత్వమే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించింది. కావున పంటల ఇన్సూరెన్స్ డబ్బులు తప్పక వస్తాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు కానీ లేదా ప్రభుత్వం గానీ ఇన్సూరెన్స్ ఇచ్చే విషయంలో ఎలాంటి చొరవ చూపడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెలరోజులు అయింది. రైతులు వ్యవసాయానికి పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల చుట్టూ అప్పుల కొరకు తిరుగుచున్నారు. కావున ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన అవసరం చాలా ఉన్నది. ఇప్పుడు కొత్తగా ఏర్పడినటువంటి ఈ ప్రభుత్వము ఆలస్యం చేయకుండా వెంటనే రైతులకు పూర్తిస్థాయిలో ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలి. జిల్లా పరిపాలన యంత్రాంగం కూడా రైతులు యొక్క కష్టాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇన్సూరెన్స్ డబ్బుల కొరకు వెంటనే ప్రభుత్వానికి ఒక లేఖ వ్రాయాలి. లేనిపక్షంలో రైతులు వ్యవసాయం చేయక సాగు విస్తీర్ణం తగ్గే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలి. కావున మీరు తక్షణమే చొరవచూపి రైతులకు రావలసిన పంటల బీమా డబ్బులు, వాతావరణ బీమా డబ్బులు పూర్తిస్థాయిలో వచ్చే విధంగా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి దంభోళనీ శ్రీనివాసరావు, రైతు సంఘం సభ్యులు సురేంద్ర యాదవ్ మరియు రబియా తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757